


సుఖాలు వచ్చేటప్పుడు మెల్లిమెల్లిగా ఒకదాని తరువాత ఒకటి వస్తాయి. కాని కష్టాలు రాకుండానే వుండాలి రావడం మొదలెడితే అన్నీ ఒకేసారి వచ్చిపడి మనిషిని ఎన్ని విధాల పీడించాలో అన్ని విధాలా పీడిస్తాయి. మానవ జీవితంలో ఎంతోమంది కష్టాలుఅనుభవిస్తున్నవారినిచూస్తున్నాం,

సుఖాలు అనుభవిస్తున్న వారినీ చూస్తున్నాం. కష్టాల్లో సుఖాన్ని చవిచూడ గలిగిన వారిని. సుఖ జీవితం గడుపుతూ వుండి కూడా కష్టాల్నే గుర్తుతెచ్చు కుంటూ జీవితం దుర్భరం చేసుకునే వాళ్లనీ చూస్తూనే వున్నాం.

కాని కొందరి జీవితాలు కష్టాలనే గాడిలో ఒకసారి పడితే మరి జీవితాంతం వరకు తప్పుకోలేక అవస్త పడుతూనే వుంటాయి.

ఆ తెగకు చెందినవాడే మేజర్‌రావు. అది దురదృష్టమే అనండి; కర్మఅనండి. ఏది ఏమైనప్పటికి రావుగారి జీవితం అంతా కష్టాలతోనే గడిపాడు. మా అందరిలోనూ పెద్దవాడవటం చేత,చాలా మంచివాడవటం చేత మా అందరికీ ఆయనంటే ఒక విధమైన గౌరవం వుండేది. మాకంటే పెద్దవాడైనా, మా నాన్న వాళ్ళలో కలిసేవాడు కాదు. మంచి అభ్యుదయ భావాలున్న మనిషి అవటం చేత మా కుర్రకారందరినీ ఎప్పుడూ వెనకాల వేసుకొని తిరుగుతూ వుండే వాడు.

నాకు బాగా జ్ఞాపకం-వేసవి సెలవలకు ఒకసారి రైలుపట్టా లవతల వున్న మామిడి తోటలోని మామిడి కాయలు దొంగిలించాం. ఎక్కడ దాక్కొని వున్నాడో తోటవాడు అమాంతంగా వచ్చి మమ్మల్ని పట్టుకున్నాడు. తన్న డానికి సిద్ధమయ్యాడు. తిన్నకాయలకు డబ్బు అక్కడ పెట్టమంటాడు. లేక పోతే తిన్నది కక్కమంటాడు. ఎలారా భగవంతుడా అని చమటలు కక్కుతూ నిలబడివున్నాం. ఆ సమయంలో ఎక్కడి నుంచి వచ్చాడో దేవుడులా వచ్చాడు మా రావుగారు. ఆ తోటవానికి ఏవో మంచిమాటలు చెప్పి మమ్మల్ని విడిపిం చాడు. డబ్బు లివ్వలేదు, ఏమీలేదు. కేవలం మాటలతోటే సాధించు కొచ్చాడు. "రండి; అబ్బాయిలు," అంటూ మమ్మల్నందర్నీ తీసుకుపోయి పొలం గట్టుమీద కూర్చోపెట్టి చక్కగా, నాజూకుగా, బుద్ధి చెప్పాడు. ఆ రోజు నుంచీ ప్రతిరోజూ ఆయనను కలుసు కుంటూ వుండేవాళ్ళం. మెల్లిగా ఒక విధమైన భక్తికుదిరింది ఆయనంటే.

అంతకు క్రితం సాయంకాలం వరకు ఏవో అల్లరి చిల్లరి పనులు చేసు కుంటూ తిరిగే మేమంతా ఆ రోజునుండీ ప్రతి సాయింత్రం ఆ మామిడి తోట దగ్గ రకే చేరే వాళ్ళం. సరిగ్గా అయిదు గంటల కల్లా మా రావుగారు వచ్చేవాడు. తెల్లగా, సన్నగా వుండేవాడు. మంచి అజాను బాహువు అవటం చేత మాకు చాలా దూరం నుంచే కనపడే వాడు. ఎంతో దూరాన ఆ విగ్రహం కనపడగానే మాకు ఏదో అర్థం కాని ఆనందం పుట్టుకొచ్చేది. ఆయనలో ఏదో మా చిన్ని బుర్రల కందని అయస్కాంతం వుండేది. ఆయనదగ్గర వుంటేచాలు, ప్రపంచంలో

ఎవరూ మమ్మల్ని ఏమీ చేయలేరనీ, అంతే కాకుండా ప్రపంచంలో ఏ మహత్తర శక్తినైనా ఎదిరించగల మని మొండి ధైర్యం కూడా వుండేది మాకు.

అప్పట్లో ఆయన బి. ఎ. ప్యాసయి వుద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్న రోజులవి. అప్పుడప్పుడు ఏవో ఇంటర్వ్యూలకని అక్కడికీ ఇక్కడికీ వెళ్ళివస్తూ వుండేవాడు. వచ్చింతరువాత అక్కడ జరిగిన విషయాలన్నీ ఎంతో చమత్కారంగా మాకు చెపుతూ వుండే వాడు. కాని వుద్యోగం మాత్రం ఆయన కొచ్చేది కాదు. యింత విజ్ఞానం కలిగిన మనిషి, ఈయనకు ఎందుకు వుద్యోగం యిచ్చేవారు కాదో మా కర్థమయేది కాదు. మాలో మేమే తర్కించుకునే వాళ్లం. ఒకవేళ ఈయన చెప్పే సమాధానాలు ఆ ఆఫీసర్ల కర్థమవ లేదేమో అనికూడా అనుకొనే వాళ్లం. ఏది ఎలాగయితే నేమి మాకు తెలిసినంత వరకు ఆయనకు మాత్రం వుద్యోగం దొరికేది కాదు.

## పదిహేను సంవత్సరాల అనంతరం

నాకు ఏలూరు బదిలీ అయింది. నా భార్య ముగ్గురు పిల్లలతో ఏలూరులో మా పాత యింట్లోనే దిగాం. ఆ వూళ్ళో మొట్టమొదటనుంచీ సొంతయిల్లే వుండటంచేత అద్దెగొడవ తగ్గుతుంది కదా



"ఇదుగో! మా వదినె పంపింది దాసీని. దాన్ని కాస్త జాగ్రత్తగా చూసుకోండి మన పనిమనిషి కరువు తీరుతుంది."

అనే వుద్దేశ్యంతోటే అధికారుల్ని పట్టుకొని మెల్లిగా ఆ వూరే వేయించుకొన్నాను. ఆ రోజు ఆగష్టు నెల 8 వ తారీకు. నాకు బాగా జ్ఞాపకం. ఎందుకంటే నాకు కాస్త సంఖ్యాశాస్త్రంలో నమ్మకం వుందిలెండి. రెండు ఎనుముదులు కలిశాయి. ఏ చెడ్డ విషయమైనా వినవలసి వస్తుందేమో నని భయపడుతూనే వున్నాను. రోజల్లా సక్రమంగానే గడిచింది. సాయంకాలం సరదాగా చిన్నప్పుడు ఆ వూళ్లో జరిగిన విషయాలన్నీ సింహావలోకనం చేసుకుంటూ కూర్చున్నాను. షికారు వెడదామని బుద్ధి పుట్టి రైలుపట్టాలు దాటి మామిడి తోటలోనికి వెళ్లాను. దాదాపు పదిహేను సంవత్సరాలక్రితం చూచిన తోట. ఎక్కడి చెట్లు అక్కడేవున్నాయి. కాని, వాటిలో కూడ ఏదో కాస్త మార్పు కనిపించింది

నాకు. పాపం! పాత తోటమాలి అప్పల స్వామి చనిపోయాడట. అతని కొడుకే చూసుకుంటున్నాడిప్పుడు. ఆ సంగతి నాకు తెలియక ఆ తోటలోకివెళ్లి "అప్పల స్వామీ" అని కేకవేశాను. కొంత సేపటికి అతని కొడుకు వచ్చాడు గుడిశ లోనుంచి ఆశ్చర్యంగా నన్ను చూస్తూ. నే నతన్ని పోల్చనే లేదు. "ఏమయ్యా! అప్పలస్వామి ఉన్నాడా?" అని అడిగాను. "మా నాయన చచ్చిపోయి అయిదారేళ్లయింది. యిప్పుడు వచ్చి ఆయన్ని పిలుస్తున్నారా! మీ రెవరేమిటండీ" అని అడిగాడు.

"అయ్యో పాపం! అప్పలస్వామి పోయాడా" అని నీ వెవరవని అడిగాను. అప్పటికి అతనే నన్ను పోల్చుకొని "మీరు పలానా కాదా," అని అడిగాడు. ఒకర్ని ఒకరు తెలుసుకున్న తరువాత బరువెక్కిన హృదయంతో తోటంతా కలియ జూచాను. చాల dirty గా వుంది. మునుపున్న శుభ్రత లేదు. చెట్లన్నీ ఏదో దిగాలుగా నా వంక చూస్తున్నాయి. కాపుకూడ బాగా తగ్గింది.

"సంరక్షణ బాగా లేదు రామయ్యా!" అన్నాను.

"ఏం చేయమంటారు బాబు! పెద్దయ్యగారు పోయాక తోటసంగతి కనుక్కునే వారే లేరు. పదిహేను రూపాయల జీతంలో ఎంతని కష్టపడను బాబు! అందుకని అడపాతడపా పైపను లేమైనా దొరికితే చూసుకుంటూ వుంటాను". అతనితో మాట్లాడుతూనే తోట బయటకు వచ్చాను. చిన్నప్పుడు మేము కూర్చునే పొలం గట్టు వైపుకు నడిచాను. దూరాన్నుంచి ఎవరో మా చోటులో (క్షమించండి పూర్వం మేం కూర్చునే చోటులో) కూర్చొని వున్నాడు.

నాలో ఏదో ఈర్ష ప్రవేశించింది. ఎందుకో నాకే అర్థం కాలేదు. ఆ పొలం నాదికాదు సరికదా కనీసం అక్కడ కూర్చునే అధికారం కూడ నాకు లేదే! ఎందుకు నాకీ ఈర్ష్య! నడిచి వెడుతున్నాము నేను, రామయ్య: ఎక్కడో చూచినట్లుగా వుంది అతన్ని. నా కేసి కూడ చూడటం లేదు. అతని బాగా మాసిన గడ్డం అదీ చూస్తే బ్రతికి చెడ్డవానిలాగే కనిపించాడు. "రామయ్యా యితన్ని ఎక్కడో చూసినట్లుందోయ్. ఎవరో తెలుసా?" అని అడిగాను.

"అదేమిటి బాబు! మన రావుగారే నండి. పాపం ఎటువంటి వాడు ఎలా అయిపోయాడు బాబూ" అన్నాడు. ఒక్కసారి నూతిలోకి నెట్టినట్లుగా అయింది నాకు.

"ఏమిటి! మన రావుగారేనా!" అవును ఆయన లాగానే వున్నాయి పోలికలు. అదేమిటి అలా మాసిపోయిన బట్టలు వేసుకున్నాడు? పైగా నల్లగా అయిపోయాడే! ఎంతటి అందగాడు. ఎంత

నీటుగా వుండేవాడు మనిషి! యింతటి మార్పుకు కారణం? తగలలేదు నా బుర్రకు—సమీపించాం.

"నమస్కారమండీ రావుగారు"— నాకేసి అదోలాగా చూసి, లేచి నిదానంగా వెళ్ళిపోయా డాయన. పాపం నన్ను గుర్తుపట్టలేదు కాబోలు. "నేను మూర్తినండీ" అని చెప్పాను. వినిపించుకో లేదు. గబగబా నడుస్తున్నాడు. అప్పుడు చూచాను అతనికి ఒక చెయ్యి లేదని. పైగా కుంటుతున్నాడు కూడ.

"అదేమిటి రామయ్యా! ఆయన కాదులాగుందయ్యా" అన్నాను.

"అబ్బే! ఆయనే బాబు. యుద్ధంలో కాలు, చెయ్యి పోగొట్టుకున్నాడు" అన్నాడు. ఈలోగా ఆయనే, ఒకవేళ నన్ను గుర్తుకు తెచ్చుకున్నాడో ఏమో తిరిగి వచ్చాడు.

"మీరు కుందావారబ్బాయి కదూ'' అన్నాడు.

"అవును" అన్నాను.

"నాకో రూపాయి ఇవ్వు" అన్నాడు. ఆశ్చర్యం వేసింది. ఎక్కడి రావుగారు! ఈ అవతారం ఏమిటి? ఈ ముష్టేమిటి? తలవని తలంపుగా జేబులోనికి చెయ్యి వెళ్లింది. చిల్లరలేక అయిదు రూపాయల కాగితం యిచ్చాను.'' "యిక్కడే కూర్చోండి. యిప్పుడే వస్తాను'' అని చరచర కుంటుకుంటూ వెళ్ళిపోయా డాయన.



తమ టిక్కెట్టు!

చాలా సేపు కూర్చున్నాను. రామయ్య అంటూనే వున్నాడు. "ఆయన ఎక్కడ వస్తాడు బాబు. ఎక్కడో తాగేసి దొర్లుతుంటాడు" అని. కాని నా కెందుకో ఆయన మళ్లీ వస్తాడని గట్టి నమ్మకం వుండిపోయింది. రామయ్యను పంపించి కూర్చున్నాను ఏకాంతంగా ఆ పొలం గట్టుమీద. సంధ్యాసమయం కూడ అయిపోయింది. వేడి గాలి తగ్గిపోయి ఎక్కడినుంచో చల్లగా తగులుతోంది మలయమారుతం. నాకు తెలియకుండానే కునుకువచ్చి అలాగే పడుకుండిపోయాను ఆ పొలం గట్టు మీద.

"మూర్తీ! మూర్తీ!" నన్ను తట్టి లేపా డాయన.

"నా కిప్పుడే జ్ఞాపకం వచ్చిందయ్యా నిన్నిక్కడే వుండమన్న సంగతి. పాపం ఆకలి వేస్తోందికదూ? యిదిగో నీ కోసం శనగలు తెచ్చా—యింద", అంటూ ఒక కాగితంపొట్లాం నాకు

ఇచ్చాడు, ఆయన ఒక దానిలో నుంచి తింటూ

శనగలు రుచిగానే కనిపించాయి ఆకలితో దహించుకుపోతున్న నాకు చాలా సేపు మౌనంగానే గడిచింది శనగలు తింటున్న చప్పుడు తప్ప

"మూర్తీ ! మీలో ఎవరైనా కనిపిస్తారేమో ననే నయ్యా ఈ రెండేండ్ల నుండి 'రెగ్యులర్'గా వస్తున్నా' అన్నాడు వాసన భరింపరానిదిగా వుంది మని షిలో గాని మాటలో గాని ఏ విధమైన తొట్రుపాటు లేదు పైగా యిందాకటి కంటే యిప్పుడే తెలివిగా కనిపిస్తు న్నాడు- పూర్వపు రావుగారు కనిపిస్తు న్నాడు ఆ మాట ఆ తీరు నా కోసం శనగలు తేవటం అన్నీ చూచేటప్పటికి నాకు మునపటి రావుగారు జ్ఞాపకానికి వచ్చాడు నా చిన్నప్పటి జీవితంలోకి వెళ్లిపోయాను 'ఏమండీ ! యిలా అయిపోయారేం !" అన్నాను

"ఆ సంగతి నీకు చెప్పడానికే నిన్ను రూపాయి యివ్వమన్నాను కాని నీవు దయతో యిచ్చిన అయిదు రూపాయ లతో కొంత పాత బాకీ కూడ తీర్చే శానులే" అన్నాడు పాపం సారా తాగి వచ్చాడు "మా తండ్రిగారిని ఈ వూరి నుంచి చెన్నపట్టణం బదిలీచేశారు అక్కడ కూడ ఉద్యోగ ప్రయత్నం మానకుండా ప్రయత్నం చేస్తూనే వున్నాను కాని ఏమీ లాభం లేకపో యింది ఈ లోగా యుద్ధం వచ్చింది SecondLıeutenaut కు అప్లయిచేశాను సెలక్టు అయ్యాను అంతకు ముందు సంవత్సరమే పెండ్లి అవటంచేత నా భార్య నన్ను యుద్ధానికి పంపడానికి చాలా కష్టపడింది అయినా వుద్యోగం దొరక్క నేను పడ్డ అవస్తలన్నీ అర్థం చేసుకొని వీరపత్నిలాగా నన్ను పం పింది యుద్ధభూమికి

అది ఆగష్టు 8 వ తారీకు అస్సాం బోర్డరులో మేజరుగా వున్నాను మానవ జీవితం తృణప్రాయంగా చూచేరోజు లవి మిత్రుడు మోహన్, నేనూ కలసి ట్రెంచ్ లోనే కాఫీ త్రాగుతున్నాం నే వద్దంటున్నా కూడా వినిపించుకోకుండా మోహన్ గాలికోసమని నిటారుగా నిల బడి ఆనందిస్తున్నాడు ఎక్కడి నుంచి వచ్చిందో ఆ బుల్లెట్ మా వాడ్ని తీసుకొని వెళ్లిపోయింది నా వళ్లుమండి పోయింది నా చేతిలో వున్న మెషీన్‌గన్ తీసుకొని పిచ్చివానిలా శత్రు మూక మీద పడ్డాను నా అదృష్టం, నేను చావ లేదు కాని చెయ్యి కాలు మాత్రం పోగొట్టుకున్నాను శత్రుమూకలో ఎంత మంది చచ్చారో నాకు తెలీదు

నాకు తెలివి వచ్చిం తరువాత చూచుకున్నా నాకు చెయ్యి లేదని నా మోకాలులో కూడా ఒక 'బుల్లెట్' వెళ్లింది కాని కాలు మాత్రం తియ్య


వల్సిన అవసరం లేదని వదలి వేశారు డాక్టర్లు

నా తండ్రి బ్రతికి వున్నంత కాలం యింటి వద్ద నుంచి వుత్తరాలు వస్తూనే వుండేవి కాని ఆయన పోయాక యింటివద్ద విషయాలే తెలిసేవి కావు నా భార్యకు మొదటి నుంచీ వుత్తరాలు వ్రాయటమంటే వల్లమాలిన సిగ్గు అందుచేత కాబోలు ఆవిడ కూడ వ్రాయలేదనుకునే వాణ్ణి

ఇక active Service కు పనికిరానని నన్ను మిలిటరీ నుంచి యింటికి పంపించారు అప్పుడు గాని నాకు తెలియలేదు మిష్టర్ మూర్తీ ! నా భార్య నా పాలిట ఒక కొడుకును వదలిపెట్టి ఈ లోకం వదలి వెళ్లిపోయిందని

బాధలు భరించగల శక్తి భగవంతుడు కొందరికి యిస్తాడు నా కివ్వలేదు బాబూ ఏ భార్య కోసం తిరిగివద్దామని ఆనంద జీవితం గడుపుదామని గాలిమేడలు కట్టుకున్నానో ఆమే లేనప్పుడు నా కెందుకు ఈ జీవితం అనిపించింది కాని బిడ్డడి కోసం బ్రతకా లనిపించి, జీవితం గడిపాను

యుద్ధంలో గెలిచిం దెవరో ఓడిం దెవరో నే నెరుగను గాని నేను మాత్రం సంపూర్తిగా నాశనమై పోయాను అలవాటయిన తాగుడు వదల్లేక చాల కష్టపడే వాడ్ని మిలటరీలో సంపాదించిన



"జోస్యం ఫ్రీ '

డబ్బుతో మొదటి రోజుల్లో బాగానే తాగేవాణ్ణి డబ్బు అయిపోయాక అప్పు పుట్టినంత కాలం తాగాను అదీ ఆగిపోయింది

ఒక రోజున మనతో కలిసి తిరిగేవాడట రామారావు, అతను కనిపించి నా పరిస్థితిని చూచి నాకు రెండు రూపాయలు ఇచ్చాడు అప్పటికే నా మురళి (అంటే మా అబ్బాయి) తెలివి మీరి పోయాడు నన్నలా త్రాగొద్దని ఎంతో బ్రతిమాలేవాడు తాగనని మాట యిచ్చాను కూడా ఇంత చిన్నవాడితో చెప్పించుకోవల్సి వచ్చింది కదా అనే బాధే కాకుండా నా గురించి ఆ తల్లిలేని అమాయక హృదయం ఎంతబాధ పడుతుందో నని విచారించే వాడ్ని

రామారావు ఇచ్చిన రెండు రూపాయలే నా జేబులో వున్నాయి నా మురళిని తీసుకొని దారిన వెడుతున్నాను సాయంత్రం ఆరున్నర అయివుంటుంది అప్పటికి రెండు రోజులనుంచి త్రాగటం లేదు డబ్బులేక ఈ రెండు రోజులలో

మురళికి ఎన్ని వొట్లన్నా పెట్టాను, ఇక జీవితంలో తాగనని కాని ఈ రోజు మాత్రం భరించ లేకుండా వున్నాను నర నరాలు బాధ పెడుతున్నాయి చాల నీరన స్థితిలో వుంది శరీరం నాకు తెలీకుండానే నా కాళ్ల సారాకొట్టుకు తీసుకు వెళ్లాయి దారిలోనే మురళికి చేసిన వాగ్దానాలన్నీ జ్ఞాపకం వచ్చి నా మనుస్సును కలవరపెట్టినా మొండికెత్తి నడిచాను సారాకొట్టుకి అప్పుడే కొట్టులోంచి బాగా తాగి తూలుతూ వస్తున్న ఒక వ్యక్తిని చూచాడు మురళి "

"నాన్నా యిక్కడికి వద్దు నాన్నా వేరే ఎక్కడికైనా వెడదాం" అన్నాడు

"లేదు బాబూ! యివ్వాళ ఒక్కరోజే. ఎక్కువ తాగను లే ఒక్క రూపాయికే యిదిగో ఈ రూపాయి నీ వుంచుకో", అంటూ అతని చేతిలో పెట్టి "యిక్కడే కూర్చో. పది నిముషాలలో వస్తాను", అని బ్రతిమిలాడాను తండ్రి మీద జాలిపడ్డట్టున్నాడు నా బిడ్డడు — సరేనని అక్కడే తూము మీద కూర్చున్నాడు


వాములు మ్రింగే స్వాములకు పచ్చగడ్డి ప్రసాదంలాగా, ఆ రూపాయి మందూ నా బుర్రకు అందలేదు పైగా యిక లేదనుకునే టప్పటికి పిచ్చెత్తిక్కించి వేసింది చటుక్కున జ్ఞాపకం వచ్చింది మురళికి యిచ్చిన రూపాయి



బయటకు వచ్చేటప్పటికి మురళీ ఏదో వెతుకుతున్నాడు "మురళీ! ఏది బాబు, ఆ రూపాయివ్వు రేపు యిస్తాను నీకు మళ్లీ", అని అడిగాను

"లేదు నాన్నా! యిక్కడే ఆడుకుంటున్నాను ఎవరో కుర్రాడు వచ్చి మాజిక్ చేస్తానంటూ ఆ రూపాయిని మాయం చేశాడు యిక్కడే మట్టిలో వుంటుంది వెతకమన్నాడు నాకు కనపడక నీకోసం కేకవేసే టప్పటికి పారిపోయాడు నాన్నా! రూపాయి దొరకటంలేదు నాన్నా". అన్నాడు ఏడుస్తూ నాకు ఎక్కడలేని ఆవేశం వచ్చింది వుడుకులు బోతునై పోయాను నా ఆస్థంతా తగలేశాడు నా కుర్రవాడను కున్నాను ఆ నష్టానికి పరిహారం ఏమిటో అర్థంకాలేదు నాకు చాచిపెట్టి కొట్టాను చెంప మీద దెబ్బకు మాట లేకుండా పడిపోయాడు నా మురళీ —

అయ్యయ్యో ఎంత పని చేశాను! నా బిడ్డను కొట్టేశానే! అయ్యో మాట కూడా లేదే! ఏం చెయ్యను—ఎవరో దయాత్ములు యింత నీళ్లు పోసేటప్పటికి తెప్పరిల్లుకున్నాడు కాని వణుకు తున్నాడు నన్ను చూసి జడిసి పోయాడు కాబోలు "లేదు బాబూ! రా!", అంటూ దగ్గిరకుతీసుకొని యింటికితీసుకొచ్చాను అంతే నాయనా! ఆ రోజే మంచ మెక్కాడు జ్వరం తీవ్రంగా వచ్చింది



"డబ్బివ్వకుండా బైట ఎట్లాపడ్డావు?"
"అదే కష్టం! మేనేజరు మెడపట్టి బైటికి గెంటాడు"

---

మందులు కొనడానికి డబ్బు ఎవరినైనా అడిగితే తాగడానికే అడుగుతున్నానను కొని యిచ్చే వారు కారు జ్వర తీవ్రత ఎక్కువై ఏదో పిచ్చి పిచ్చిగా మాట్లా డుతూ వుండేవాడు "నాన్నా మాజిక్", అనేవాడు "యిక నుంచి తాగొద్దు నాన్నా తాగావంటే అమ్మతో చెప్పేస్తా" అంటే అప్పుడే నిర్ధారణ చేసుకున్నా దన్నమాట నాతో వుండకూడదని వారం తిరక్కుండానే పోయాడు బాబూ"

పాపం! వెన్నెలలో అతని ముఖం ఎంతో భయంకరంగా కనిపించింది త్రాగుడుతో బాగా ఎర్రబారిన కళ్లల్లో నుంచి ప్రవాహంగా పారుతున్నాయి కన్నీళ్లు చటుక్కున లేచి, వస్తానని వెళ్లిపోయాడు

అదే ఆఖరుసారి నేను మేజరు రావు గార్ని చూడటం

పాపం ఏమైపోయాడో ఏమో ★